
కథ

# తథాస్తు!

సీతా సత్య

ఆఫీస్ నుంచి ఠంచనుగా అయిదున్నర కల్లా ఇంటికి రావడం, రామారావుకు ఈ మధ్యనే అలవాటైంది. ఆ రోజు వానొచ్చినా, వరదొచ్చినా, దార్లో కుక్కలు మొరిగినా, పందులు అడ్డం వచ్చినా అతడు ఇంటికి వచ్చే సమయం మాత్రం మారేదికాదు.



అందుక్కారణం —అతడు క్రమశిక్షణప రుడు మాత్రం కాదు. ఆ టైమ్‌కు సరిగ్గా అతణ్ణి బలంగా లాగే అయస్కాంతం, నూతన వధువు సీత పేరుతో ఇంట్లో ఉండడమే!


సీత కూ్కడా ప్రతి రోజూ సీతాకోక చిలుకలా చక్కగా సింగారించుకుని, గుమ్మంలో నిల్చుని రామారావును టైమ్‌కు ఆహ్వానించడం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉండేది.

కానీ సీత కంటే ఎనిమిదేళ్ల పెద్దదైన ఇరుగింటి సుబ్బలక్ష్మికి మాత్రం రోజూ సాయంత్రం అయిదున్నరకు —ఒళ్లంతా చాకుతో గాట్లు పెట్టుకుని, కొరివి కారం అద్దుకుని ఎండలో పరుగెత్తినట్టుగానూ, ఒళ్లంతా దబ్బనంతో కుళ్ల బొడిచినట్టుగానూ, యమభటులు తనను బ్రతికుండగానే తుప్పుపట్టిన అంపాలతో పరపరా కోసి నూనెలో వేయించినట్టూ —ఇలా రకరకాల మధురోహలు కలిగేవి.

తన కళ్లెదురుగానే రామారావు, సీత భుజం మీదో, నడుం మీదో చేయి వేసి ఇంట్లోకి తీసుకువెళ్లడం చూసితట్టుకోలేక, తన దిక్కుమాలిన మొగుడు ఆ సమయంలో కనీసం పొరపాటుగానైనా ఆ వీధి చివర ఎక్కడైనా తమింటికొస్తూ కనిపిస్తాడేమోనని, తెగ ఆరాటపడిపోతూ అటూ ఇటూ చూస్తూ నానా హైరానా పడిపోయేది సుబ్బలక్ష్మి.

ఆలా కొంత కాలం గడిచాకా, 'ఎదుటి వ్యక్తి దిగులు పడినపుడు మన మనసుకు కలిగే ఆనందం మరి దేనికీ తీసిపోద'నే విష

## సంక్రాంతి హాస్యకథల పోటీలో



యం, ఓ రోజు చటుక్కున స్ఫురించడంతో, మధ్యాహ్నం రెండు గంటలకు సీతా వాళ్ళింటి గుమ్మం తలుపు తట్టింది సుబ్బలక్ష్మి.

తిరిగి అయిదు గంటల ఇరవై తొమ్మిది నిముషాలకు ఆ ఇంటి నుంటి బయటపడి, తమింటి కిటికీ తలుపులు ఓరగా తెరిచి, కాగల కార్యం కోసం గంధర్వుడి భార్యలాఎదురు చూడసాగింది.

ఎప్పటిలానే ఆ రోజు సాయంత్రం అయిదున్నర గంటలకు ఇంటికి చేరిన రామారావుకు గుమ్మంలో సీత కనబడక పోవడంతో తాను సరైన చిరునామాకే వచ్చాడా? అని అనుమానవొచ్చి అటూ ఇటూ కంగారుగా చూసాడు.

ఇంటికి ఎడం పక్క మున్సిపాలిటీవారి చెత్తకుండీ పక్కన నిర్విరామంగా గోక్కుంటూన్న గజ్జి కుక్కనూ, కుడి పక్క వంటినిండా అంటుకున్న బురద కలిగించిన పారవశ్యానికి పులకరించిపోతూ, ముట్టెను అడుగులోతు బురదలో ముంచి, పిలకజడలాంటి తన తోకను [illegible] ఊపుతున్న మారక రాజాన్ని చూసిన తర్వాత [illegible] తనింటికే తనొచ్చాడనే నమ్మకం [illegible] తడికి.

కానీ సీత గుమ్మంలో నిలబడి ఉండకపోవడం మాత్రం వింతల్లో కెల్లా వింతగా అనిపించిందతడికి. రామారావు హావభావాల్ని, ముఖకవళికల్నీ, కిటికీ తలుపు సందుల్లోంచి చూస్తోన్న సుబ్బలక్ష్మికి మాత్రం ఏదో చెప్పరాని హాయి మనసునంతా ఆవహించింది.

రామారావు ఇంట్లోకెళ్ళి, ముందు రెండు గదుల్లోనూ సీత కనబడకపోవడంతో అమితంగా కలవరపడిపోయి ఒక్క ఉదుటున పెరట్లోకి పరుగెత్తి అక్కడ అశోకవనంలోని సీతమ్మవారిలా దిగులుగా కూర్చుని, చేతిలోని సుద్దముక్కతో నేల మీద గుణకారాలూ, భాగహారాలూ చేస్తోన్న సీతను చూసి, హా.... సీతా!" అని దిక్కులు పిక్కటిల్లిపోయేలా అరిచాడు.

భర్త అరుపు ఆమె చెవులకు సోకిందో లేదో గానీ పక్కింటి సుబ్బలక్ష్మి చెవులు మాత్రం గింగిరాలు తిరిగాయతడి అరుపు కలిగించిన ప్రతిధ్వనికి.

ఓ పది నిముషాలు గడిచాక, తనను ప్రసన్నం చేసుకునే ఉపాయమేమిటో సుద్ద ముక్క సాయంతో అంకెల భాషలో తెలియ జెప్పింది సీత. ఉపాయం బాగానే ఉంది కానీ, ఆచరణలో పెట్టాలనే ఊహే ఎంతో భయంకరంగా అనిపించిందతడికి.

పెళ్లయిన కొత్తల్లో బిన్నీ జార్జెట్ చీర కొనమని మారాంచేసిన సీతను చిన్నబుచ్చడం ఇష్టం లేక తన కొలీగ్ నిత్యానందం తలమీద చేయిపెట్టి, ఆ చేతిని సీతముందు తెరవగా, ఆమె ఆనందంగా మర్నాడే తను మనసుపడిన చీరను కొనుక్కు తెచ్చుకోవడమే కాకుండా, వెంటనే దాన్ని వంటికి సింగారించుకుని, మొగుడి కళ్లల్లో మెరుపుల్ని చూసి మురిసిపోయి, అదే గెటప్‌లో ఇరుగుపొరుగు వాళ్ల ఇళ్లు సందర్శించి, ఆ ఆడవాళ్ల కళ్లల్లో అసూయను చూసి తరించడమే కాకుండా, వాళ్ల మొగుళ్ల గుండెల్లో వాళ్ల పెళ్లాల చేత శతఘ్నుల్ని మ్రోగింపచేసింది.

తరువాత కొన్ని రోజులకు సీత మోజుపడిన ముత్యాలహారాన్ని ఆమెకు కానుకగా ఇవ్వడం కోసం ప్రావిడెంట్ ఫండ్ లోన్ పెట్టి సేఠ్ మోతీలాల్ దుకాణంలోకి మొదటిసారిగా అడుగుపెట్టాడు.

ఆ ముచ్చట కూడా తీరాక సీతకు భర్తమీద అంతులేని అనురాగం కలిగి, సుబ్బలక్ష్మితో పరిచయం కలిగే వరకూ అలాగే కొనసాగింది. భార్య మనసు పడిన దాన్ని దేన్నైనా ఏదో రకంగా తంటాలు పడి అమర్చడమో లాగో తెలుసుకున్న రామారావుకేనాడూ

## ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

తమ భార్య కోరికల మీద కోపం కలగలేదు.

కానీ ఆ రోజు సాయంత్రం అయిదు గంటల నలభై నిముషాలకు సీత పేల్చిన వార్త అతడి గుండెలోంచి దూసుకుపోయి తలలో ధడాల్మని పేలి మెదడును చిన్నాభిన్నం చేసి పారేసింది.

గత మూడు నెలలుగా ఏ కోరికనైతే సిత నుంచి వినకూడదని ఆతడహరహమూ అశ పడ్డాడో ఆది కాస్తా అంతమయ్యేసరికి అతడి నవనాడులూ కుంగిపోయాయి.

తనెంత జాగ్రత్తగా ఉన్నా, భార్య మనసులో ఆ విషబీజాలెలా నాటుకున్నాయో ఎంత ఆలోచించినా అతడకర్థం కాలేదు. తాత్కాలికంగా 'అలాగే' అని తప్పించుకుని ఆ రోజు రాత్రి తన పక్కనే ఒళ్లు తెలియనంతగా నిద్రపోతున్న సీతను చూసి నిద్రకు పూర్తిగా దూరమై, మర్నాడాఫీస్‌లో కునికిపాట్లు పడడం ప్రారంభించాడు.

తన సర్వీస్‌లో ఏనాడూ రామారావు నావిధంగా చూసి ఉండని పక్కసీటు భీమారావు ఒకింత ఆశ్చర్యపోయి అప్రయత్నంగా రామారావు భుజంమీద చేయి వేశాడు.

"అలాగే సీతా, తప్పకుండా కొంటాను. అలాగే అన్నానుగా. ఊరుకో మరీ!" అంటూ భీమారావు మెడచుట్టూ చేతులు వేసి దగ్గరగా లాక్కుని అతడి బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు రామారావు.

"ప్చ్!" అనే చప్పుడు ఆ ఆఫీస్ గదిలో స్పష్టంగా వినిపించడంతో సీరియస్‌గా ప్రేమ నవల చదువుకుంటున్న మంజుల నవలలోని హీరోయే తన బుగ్గమీద ముద్దు పెట్టినట్టుగా ఉలిక్కిపడి బుగ్గమీద తడుముకుని జాగ్రదవస్థలోకి వచ్చింది.

భీమారావుకు రోజూ షేవ్ చేసుకునే అలవాటు లేకపోవడాన అతడి చెంపల కరుకుదనానికి ఏదో పురుగును ముద్దు పెట్టుకున్న భావన కలిగి రామారావుకు ఠక్కున మెలకువ వచ్చి భీమారావు మెడచుట్టూ బిగించిన రెండు చేతుల్నీ హఠాత్తుగా వదిలేయడంతో అప్పటికే రామారావు చర్యకు బిక్కచచ్చిపోయి ఉన్న భీమారావు ఉన్నట్టుండి తన మెడమీద చేతులు పట్టు సడలడంతో దభీమని వెనక్కు పడిపోయాడు.

ఆ పడడం, పడడం అదే సమయానికటుగా వచ్చిన హెడ్‌క్లర్క్ సిద్దేశ్వరి మీద పడడంతో ఆమె రెండు చేతుల్తోనూ అతన్ని పట్టుకుని "ఆఫీస్ వేళల్లో ఏవిటా ఆటలు?" అని గద్దించింది.

కానీ దూరంనుంచి చూసే వాళ్లకా దృశ్యం అమె అతని రెండు చేతుల్లోకి తీసుకుని గుసగుసలాడినట్లుగా అనిపించింది.

లంచ్ అవర్ వరకూ అదే విషయాన్ని చిలవలు పలవలుగా చేసి చెప్పుకున్న ఆఫీస్ ఉద్యోగులంతా కడుపులో ఎలుకల బాధ భరించలేక తలోవైపుకూ పరుగు తీసిన క్షణంలో రామారావు, భీమారావు చొక్కా దొరకబుచ్చుకుని ఆఫీస్ బయటకు లాక్కుపోయాడు.

అసలే ఉదయం తన అనుభవంతో బెంబేలెత్తిపోయి ఉన్న భీమారావు, రెండు చెంపల్నీ చేతుల్తో కవర్ చేసుకుంటూ విడిపించుకోబోయాడు.

కానీ రామారావు తన శక్తియుక్తులన్నిటినీ ఉపయోగించి భీమారావును రెండు చేతుల మధ్యా ఇరికించి ఆఫీస్ ఆవరణలో ఉన్న నిద్రగన్నేరు చెట్టు నీడలోకి తీసుకువెళ్లడంలో కృతకృత్యుడయ్యాడు.

తన బ్రతుకేం కానుందో అని గుండాపిండీ అయిపోయిన భీమారావు తీరా రామారావు చెప్పిన విషయం విని అదిరిపడ్డాడు.

అదిరిపడడమే కాకుండా, "ఈ బాధ నీకూ తప్పలేదా బాసూ" అంటూ బావురుమన్నాడు. రామారావు ఎంతో కష్టంమీద భీమారావు కన్నీళ్లు తుడిచి తనే అతన్ని ఓదార్చవలసి వచ్చింది.

ఆ తరువాత ఇద్దరూ హాఫ్‌డే లీవ్ పెట్టి ముత్యాలయ్య దగ్గరరకు వెళ్లారు. వాళ్లిద్దర్నీ దూరంనుంచి చూస్తూనే ముత్యాలయ్య సాదరంగా ఆహ్వానించి కుశలమడిగి వాళ్లొచ్చిన విషయం తెల్సుకుని దీర్ఘాలోచనలో పడ్డాడు.

ముత్యాలయ్యంతటివాడే కాస్సేపు నోట మాట రాకుండా ఉండిపోవయంతో గుండెల్లో గుబులు పెరిగిపోయిందిద్దరికీ.

రామారావే నోరు తెరిచి 'అదేవిటి ముత్యాలయ్యగారూ, ఉన్నట్టుండి అలా అయిపోయారేవిటి? మమ్మల్ని ఆపదనుంచి గట్టెక్కించేందుకేదో ఉపాయం చెప్తారని గంపెడాశతో మేఁవొస్తే మీరే అలా అయిపోతే ఇక మాకు దిక్కెవరు దేవుడో!?' అంటూ భోరుమన్నాడు.

అంత వరకూ ఏదో ఆలోచిస్తోన్న ముత్యాలయ్య' హుర్రే' అని అర్థం వచ్చేలా గట్టిగా సకిలించి, 'దేవుడు...దేవుడు...అవును దేవుడొక్కడే మిత్మల్ని ఆపదనుంచి గట్టెక్కించగలడు. పదండి అంతాదేవుడి దగ్గర కెళ్లాం. 'అంటూ భుజం మీది తువ్వాలును గట్టిగా దులిపి, ఇద్దరి భుజాల మీదా చేతులేసి, దేవుడింటి వైపు సాగిపోయాడు.

త్రిమూర్తుల్లా తనింటి ఆవరణలోకి ప్రవేశించిన ఆ ముగ్గుర్నీ చూసి దేవుడు మొహం చిట్లించాడు. ఆ చిట్లింపుకు కారణం, వారంటే అతడికి ఇష్టం మాత్రం కాదు. ముత్యాలయ్యతో తప్ప మిగిలిన ఇద్దరితోనూ అతడికి పరిచయం లేదు.

కొత్తవారి నెవరిని మొదటిసారి చూసినా అతడు మొహాన్నలానే చిట్లిస్తాడు. అతడి మొహం చిట్లింపు పూర్తై తిరిగి మామూలు స్థితికొచ్చిన తరుణంలో వారుముగ్గురూ అతడికత్యంత సమీపంగా చేరుకున్నారు.

వారిద్దరి తరఫున ముత్యాలయ్యే దేవుడితో మాట్లాడాడు. అంతా విన్న దేగుడు ఏ మాత్రమూ కంగారు పడకుండా చిద్విలాసంగా నవ్వుతూ, 'ఇదో సమస్యటయ్యా' డిస్కో ఫ్లవర్ కంపెనీ కొనిపిస్తే సరిపోయేదానికి వీళ్ళిద్దర్నీ పనిగట్టుకుని నా దగ్గరకు తీసుకు రావాల్టయ్యా!' అన్నాడు.

రావు ద్వయం తెల్లబోయి ముత్యాలయ్య వైపు చూశారు. ముత్యాలయ్య అసలు విషయం అప్పుడు చెప్పాడు.

'వీళ్ళిద్దరికీ ఈ బిజినెస్ కొత్త. భార్యల పోరు పడలేక నా దగ్గరకు పరుగెత్తుకొస్తే , నేను నీ దగ్గరకు తీసుకొచ్చాను. మనఁవంటే ఈ బిజినెస్‌లో పదేళ్ళనొంచి ఉన్నాంగనక, ఒడిదుడుకుల్ని తట్టుకోగలం.

కానీ పాపం వీళ్ళు నీ మాటనమ్మి అప్పొసొప్పొ చేసి ఇల్లూ వళ్లూ తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బంతా పోసి ఏ ఎబ్రాసి కంపెనీ షేర్లో కొన్నారంటే...తర్వాత ఆ బాధ తట్టుకోడం కాదుగదా, ఏగుండె పోటో తెచ్చుకుని పెళ్ళాల మెళ్ళో పుస్తెలు తెంపేసి పైకెళ్ళిపోయినా వెళ్ళిపోతారు. అందుకే, ఏదో నోటికొచ్చిన కంపెనీ పేరు కాకుండా జాగ్రత్తగా ఆలోచించిమరీ చెప్పు' అన్నాడు ముత్యాలయ్య

దేవుడు వాళ్ళిద్దరి వైపూ ఓరగా చూశాడు.

రావు ద్వయం 'మరే...మరే' అన్నట్టుగా ముత్యాలయ్య వైపు మెచ్చుకోలుగా చూసి, దేవుడి వైపు ఆశగా చూశారు.

దేవుడు చేతిలోని చుట్టనుసిని విదిల్చి 'సర్లే...సర్లే... 'ది బొబ్బర్లంక సుట్టల కంపెనీలో సగఁవూ, డింగ్ డాంగ్ చెప్పుల కంపెనీలో సగఁవూ పెట్టమను. తర్వాత ట్రెండ్ జూసి మిగిలిన సంగ జ్జూద్దాం.' అన్నాడు.

దేవుడికీ, ముత్యాలయ్యకూ యధాశక్తి కృతజ్ఞతలు తెలియజేసుకుని అప్పుల వేటకో 'సం తలో ద [illegible]రశఈ పట్టారు రావు ద్వయం. ఆ రోజు రామారావు ఇంటికొచ్చేసరికి రాత్రి ఏడున్నరయింది.

సరిగ్గా ఏడు గంటల ముప్పై ఒక్క నిముషానికి సుబ్బలక్ష్మి మొగుడి బుగ్గ మీద గట్టిగా ముద్దుపెట్టుకుంది.




"ఏమేవ్! ఈ పూట ఏం కూర వండావేమిటి?" అడిగాడు భర్త.

"పాల కూరండీ!" చెప్పింది భార్య.

"అసలే 'పాలు' దొరక్క చస్తుంటే ఆ కూర ఎందుకు వండావే!' విసుగ్గా అడిగాడు అయోమయం భర్త.

— ఎస్. అశోక్, సత్తుపల్లి.

## రచయిత(ల) పరిచయం



కలం పేరు : సీతా సత్య
అసలు పేర్లు : కె.వి.వి. సత్యనారాయణ రాజు, కె. రామసీత
చిరంజీవులు : శిరీష, శిల్ప
స్వస్థలం : పశ్చిమగోదావరి జిల్లా భీమవరం —పాలకొల్లుల మధ్యన ఉన్న పెన్నాడ, దగ్గులూరు గ్రామాలు.
ప్రస్తుత చిరునామా : కె.వి.వి.ఎస్. రాజు, జూనియర్ లయజన్ ఆఫీసర్, కాఫీ బోర్డు, చింతపల్లి, విశాఖపట్టణం జిల్లా, పిన్. 531 111
రచనానుభవం : మా తొలి కథను ప్రచురించిందీ, తొలిసారి బహుమతినిచ్చిందీ ఆంధ్రప్రభ! ఆంధ్రప్రభ నుంచి బహుమతి అందుకోవడం ఇది రెండవసారి. ఇంతవరకూ నూట ఇరవై అయిదుకు పైగా కథలూ, రెండు నవలికలూ దాదాపు అన్ని పత్రికలలోనూ ప్రచురితమయ్యాయి. ఆంధ్రప్రభలో ఇది మా ఇరవై మూడవ కథ.
గతంలో 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఉగాది కథల పోటీల్లోనూ, 'రచన' మాసపత్రికలో నిర్వహించిన హాస్యకథల పోటీలోనూ మా కథలు బహుమతులందుకున్నాయి.
మా కథను బహుమతికి ఎంపిక చేసిన ఆంధ్రప్రభ సంపాదకవర్గానికీ, న్యాయ నిర్ణేతలకూ కృతజ్ఞతాభివందనములు. సాహితీ మిత్రులందరికీ శుభాకాంక్షలు.

— సీతాసత్య

సుబ్బలక్ష్మి మొగుడు ఉలిక్కిపడి, 'అప్పుడే ఏవిఁటే , ఇంకా భోయనాలైనా కాకుండా' అన్నాడు దిగులుగా ఎందుకైనా మంచిదని కొంచెం దూరంగా జరుగుతూ.

సీత, రామారావుతో రాత్రి పదిన్నర దాటాకగానీ మాట్లాడలేదు. అదీ ఒక్కమాటే మాట్లాడింది. 'ఏవోఁ ఏం చేస్తారో నాకనవసరం! రేపీసరికి ఆ రెండు కంపెనీల సర్టిఫికెట్లు నా చేతుల్లో ఉండి తీరాలి!'

ఓ చెత్తో తల పట్టుకోబోయి, అది పద్ధతి కాదని కృష్ణపరమాత్ముణ్ణి గుర్తుతెచ్చుకుని, రెండు చేతుల్తోనూ సీతకాళ్ళు పట్టుకున్నాడు రామారావు, 'తంతే తన్ననీలే...గండం గట్టెక్కితే చాల'నే దురూహతో

ఊహుఁ ఆ మాత్రానికే కరిగిపోయి అతణ్ణి వెంటనే తన్నేందు కామె సత్యభామ కాదు కదా !

ముక్కెగబీల్చింది. మంచం మీది దుప్పటిని సర్రున లాగి నేలమీద పరచి, తలదిండును రెండు చేతుల్తోనూ విసురుగా ఎత్తి నేలమీద పడేసి మరుక్షణంలో నేలమీదకు చేరుకుని మూడంకె వేసింది.

రామారావు మంచం మధ్యలో పద్మాసనం వేసుక్కూర్చుని, హిమాలయాల్లో ఒంటికాలిమీదా, బొటనవేళ్లమీదా బాలన్స్ కాచుకుంటూ తపస్సు చేసే ఋషిపుంగవుల్ని తలచుకుంటూ, ఎఫెక్ట్ రావడంకోసం, తెల్లవార్లూ, 'ఉహూహూ...అహహా...' అని వణుకును అరువుతెచ్చుకుని మరీ ఆలోచించాడు. అలా చించగా...చించగా తెల్లవారుజామున మూడుగంటల యాభైతొమ్మిది నిముషాల కతడిమొహంలో జ్యోతి వెలిగింది.

ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా క్రిందికి వంగి భార్య కాళ్లు పట్టుకుని లాగాడు. గత రాత్రి చేయాల్సిన పనిని అప్పుడు చేసింది సీత. ఒక్క క్షణం తల దిమ్మెక్కి కళ్లు బైర్లు కమ్మి మంచంమీద నుంచి కిందపడ్డాడు రామారావు.

'దబ్' మని శబ్దం వినబడ్డంతో తక్కున లేచి కూర్చుని, మంచంమీద మొగుడు కనబడకపోవడంతో పాటు కాళ్లకు ఏదో మెత్తగా తగలడంతో కెవ్వుమని అరిచింది సీత. ఆ అరుపు మొగుడిపక్కలో పడుకుని పంచరంగుల్లో కలలు కంటోన్న సుబ్బలక్ష్మిని నిద్రలేపింది.

ఎలాగైతేనేం, సూర్యోదయమయ్యే సమయానికి భార్య గాజులూ, నల్లపూసల తావళమూ పట్టుకుని సేఠ్ మోతీలాల్ దుకాణం అరుగుమీదకు చేరుకున్నాడు రామారావు.

అదేసమయానికి అక్కడకు చేరుకుని, నెత్తిమీద అడ్డంగా తువ్వాలు వేసుకుని శూన్యంలోకి చూస్తూ, బొటబొటా కన్నీళ్లూ కారుస్తోన్న భీమారావును కౌగిలించుకుని అతడి కన్నీళ్లు తుడుస్తూ,

"ఊరుకో...ఊరుకో... పెళ్లాల చేతుల్లో తన్నులు తింటేతిన్నాం గానీ, మనం కూడా షేర్‌బిజినెస్ చేసేస్తున్నాం, ఇవ్వాళ్టినుంచీ" అన్నాడు రామారావు.

ఆ మరుక్షణమే ఇద్దరికీ చెరో బ్రహ్మాండమైన దృశ్యమూ సాక్షాత్కరించింది కళ్ల ముందు.

తాను రోల్స్‌రాయిస్ కార్లో వెడుతూండగా హర్షద్‌మెహతా సిటీబస్ స్టాప్‌లో నిలబడి సిటీ బస్ కోసం దీనంగా ఎదురుచూస్తుండడం కనబడి వళ్లు పులకరించిపోయింది రామారావుకు.

తాను బ్యూక్ కార్లో పెళ్లాం పక్కన కూర్చుని, ఓ చేత్తో భార్య భుజంచుట్టూ చేయి వేసి, మరోచేత్తో దర్జాగా డ్రైవ్ చేస్తూండగా, పేవ్‌మెంట్ మీద నడుచుకుంటూ వెళ్తోన్న మన్మోహన్‌సింగ్ చెంగున రోడ్డుమీదకు దూకి, 'లిఫ్ట్ ప్లీజ్' అని దీనంగా అడగడం చూసి, తాను యాక్సిలేటర్ బలంగా తొక్కాడు. 'ఓహ్! ఎంతద్భుతంగా ఉందా దృశ్యం?' అనుకోకుండా ఉండలేకపోయాడు భీమారావు.

ఆ రోజు మధ్యాహ్నం నెత్తిమీద ఎండ మాడ్చేస్తున్నా, వళ్లంతా చెమటలు కారుతోన్నా, వెన్నెల్లో నడిచినంత కులాసాగా ఈలవేసుకుంటూ షేర్‌సర్టిఫికెట్లిచ్చిన కిక్‌తో తూలుతూ ఇంటికి చేరుకున్న రామారావుకు గుమ్మంలో నిలబడి పాలుపోసే ఆవిడతో వాదిస్తూ కనబడింది సీత.

"ఏటమ్మో, మానావు మాటలాడేస్తన్నావ్ ! ఇష్టఁవైతే పోయించుకో, నేకపోతే నేదు. నేనూ కొన్నాను గుడ్డల కంపెనీ షేర్లు, ఏటనుకుంతన్నావో ! ఆఁ..." అని చెరిగేస్తోంది కనకమాలక్ష్మి.

అదే అనుభవం రిక్షావాలాల్లోనూ, కాఫీ హోటళ్ల క్లీనర్లతోలూ, పందుల్ని మేపే పెంచలయ్యతోనూ, పిడకలమ్మే పోచమ్మతోనూ రెండు మూడు రోజుల తేడాతో ఇంచుమించుగా ఎదురైంది దంపతులిద్దరికీ.

దాంతో పౌరుషఁవొచ్చి ఇంట్లోని ఫ్రిజ్జూ, బీరువా, టీవీ, టేప్‌రికార్డరూ, డైనింగ్ సెట్టూ, మంచాలూ ఇత్యాదులన్నీ ఒక్కొక్కటే అమ్మేసి రకరకాల సర్టిఫికెట్లతో ఇల్లంతా నింపేసి చాపమీద పడుకోవడం, మట్టికుండలోని చల్లని నీరు తాగడం, జర్మన్ సిల్వర్ బొచ్చెల్లో తినడం అలవాటు చేసుకుని రాబోయే కాలంకోసం కళ్లూ, వళ్లూ ఇంతలు చేసుకుని చూడసాగారు రామారావు దంపతులు.

షేర్ల విలువ నెల రోజుల్లో ఒకటిన్నర రెట్లు పెరగడంతో ఆనందం పట్టలేక మొగుణ్ణి వీధిలోనే కౌగలించుకుంది సీత.

అదే రోజు సుబ్బలక్ష్మి చీపురుకట్ట తిరగేసి మొగుణ్ణి వీధిలోకి తరిమింది.

సుబ్బులక్ష్మిని చూసి రెచ్చిపోయి ఆ వీధిలోని సావిత్రి, సక్కూబాయి, సరస్వతి, పార్వతి —వీళ్లంతా కూడా మొగుళ్లను కాలితో తన్ని, చేతుల్తో గుద్ది, గోళ్లతో రక్కి షేర్లు కొనిపించి... వీధి మొగలో కాపుకాసి అక్కడికక్కడే మొగుళ్లను కౌగలించుకుని ఇళ్లకు తీసుకురావడం ప్రారంభించారు.

మూడు నెలల్లో ఆ వీధిలోని వారందరి షేర్ల విలువా మూడు రెట్లయింది. జనం ఇంట్లో ఉండకుండా ఆ ఊళ్లో ఉన్న బిజీ సెంటర్లలో నిలబడి వంటిమీది గుడ్డల్ని కూడా పట్టించుకోకుండా "జుంబా...ఆగుంబి" అంటూ తైతక్కలాడసాగారు.

నాలుగో నెలలో సగానికి సగం పడిపోయింది రేటు. అయిదో నెలలో కొన్న రేటుకు దిగిపోయింది షేర్ల విలువ.

ఆరో నెలలో 'డింగ్ డాంగ్ చెప్పుల కంపెనీ' ఓనర్ నెత్తిన చెంగేసుకుని గోదాట్లో దూకబోతుండగా వీరవనితలంతా కాపుకాసి పట్టుకుని చితకతన్నారు.

'ది బొబ్బర్లంక చుట్టల కంపెనీ' సంస్థాపకుడు పద్దయ్య తెలివిగా రాత్రికి రాత్రే కంపెనీ పేరు మార్చి ఎందుకైనా మంచిదని తానుకూడా మారువేషం వేసుకుని కొత్త కంపెనీలో పెట్టుబడికి నోటిఫికేషన్ జారీ చేశాడు.

ఏడాది తర్వాత...

ముత్యాలయ్య తన భవంతిపైన మరో అంతస్తు కట్టాడు.

దేవుడుబాబు మరో నాలుగు కొత్త కంపెనీలు స్థాపించాడు.

కనకమహాలక్ష్మి మిక్కిలి వినయంగా "చిక్కటిపాలు మీ ఇంటికే తెచ్చి పోస్తాను, తీసుకోండమ్మా" అంటూ గేదెని తోలుకుని ఇంటింటికీ తిరగసాగింది.

రిక్షావాలా, హోటల్ క్లీనర్లూ, పెంచలయ్య, పోచమ్మ —ఎవరి బిజినెస్‌లో వారు సెటిల్ అయిపోయారు.

రామారావు, భీమారావు గెడ్డాలు పెంచుకుని భార్యల భుజాల మీద చేతులు వేసి చెరో వీధిలోనూ, "బాబూ షేర్లు... అయ్యా షేర్లు... చవక బాబూ... కారుచౌక తల్లీ... అమ్మా షేర్లు..." అంటూ నెత్తిమీది బుట్టల్లోని కాగితాలను మధ్యమధ్యలో చేత్తో బయటకు తీసి చూపిస్తూ కాళ్లరిగిపోయేలా తిరుగుతున్నారు ప్రస్తుతం.

తమింటి ముందున్న వీధిలో నడిచివెళ్తోన్న రావు ద్వయాన్ని ఓరకంటి చూస్తూ, "అయినా మధ్యతరగతి వాడికి షేర్ బిజినెస్సేవిటీ, మా బాగా అయింది" అన్నాడు ముత్యాలయ్య దేవుడితో.

"తథాస్తు!" అన్నాడు దేవుడు కొత్త షేరు దరఖాస్తు ఫారం మీద వేలిముద్ర వేస్తూ.

## 'గాలి' కబుర్లు

మామూలుగా గాలి మన కంటికి కనపడదు. కాని చల్లని గాలి వీచినప్పుడు మనకి హాయిగా వుంటుంది. గాలి లేకుండా మనుగడే లేదు. పంచభూతాలలో గాలి ఒకటి. గాలిని వాయుదేవుడనే సాంప్రదాయం. మన సంస్కృతిలో వుంది. పెనుగాలి వీచినప్పుడు గాలిదుమారం చెలరేగుతుంది. మహా వృక్షాలు కూకటివేళ్లతో సహా పీకివేయబడతాయి. అసలు మనం భూమిమీద నిలబడడమే కష్టమైపోతుంది. హోరుమని గాలి వీస్తుంటే కంటికి నిద్ర కూడా రాదు.

వాతావరణ శాస్త్రపరంగా చెప్పాలంటే గాలి అధిక పీడనం వున్న ప్రదేశం నుంచి తక్కువ పీడనం ఉన్నవైపు కదిలినప్పుడు గాలి వీచినట్లు మనం భావిస్తాం. గాలితో నిండిన బెలూన్ నుంచి గాలి బయటికి పోయినప్పుడు సరిగా అదే జరుగుతుంది. రెండు ప్రదేశాల మధ్య పీడనంలో వ్యత్యాసం ఎక్కువయిన కొద్దీ అక్కడ వీచే గాలి ఎక్కువ బలంగా ఉంటుంది. ప్రకృతిలో భూమి ఉపరితలం సూర్యకిరణాల వల్లనే వేడెక్కినప్పుడు దానిపైనున్న గాలి పైకి లేస్తుంది. ఇలా పైకి లేచిన గాలి స్థానంలోకి ఇంకా ఎక్కువగా మారుతుంది.

చల్లని దట్టమైన గాలిచల్లని వుపరితలం మీదికి దిగుతుంది— ఉదాహరణకు మహాసముద్రం. ఈ చల్లని గాలి సముద్ర ఉపరితలం నుంచి భూమి ఉపరితలం మీది నుంచి పైకి లేచే వెచ్చని గాలి స్థానంలోకి ప్రయాణిస్తుంది. ఈ విధంగా ఉపరితల వాయువులు ఏర్పడతాయి. అలాస్కా, కాలిఫోర్నియా, వంటి ప్రదేశాలలో విపరీతమైన పెనుగాలులు వీస్తాయని ప్రతీతి. గాలి వేగానికి ప్రపంచ రికార్డు 1934 ఏప్రిల్ 12న అమెరికాలోని మౌంట్‌వాషింగ్‌టన్ పర్వత శిఖరం మీద నమోదు చేశారు. గంటకి 372 కి.మీ. దీని ఎత్తు 1872 మీటర్లు మాత్రమే. మౌంట్ ఎవరెస్ట్ వంటి శిఖరాల కన్నా తక్కువే. కాని హిమాలయాలకి, అంటార్కిటాకి వెళ్లాలనుకున్నవారు అక్కడ శిక్షణ పొందుతారు. ఎందుకంటే అక్కడి పరిస్థితులు ఒకే మాదిరిగా వుంటాయి.

గాలి వేగంగా వీస్తున్నప్పుడు రోడ్ల మీద వాహనాలు నడవడం కూడా కష్టమైపోతుంది. అమెరికాలోని రాకీమౌంటెన్ నేషనల్ పార్క్‌లో గంటకి 275 కి.మీ. వేగంతో గాలి వీస్తున్నప్పుడు మోటార్ సైకిళ్లు కొట్టుకుపోతాయని నమోదు చేశారు. కార్ల కిటికీలు విరిగి పోతాయి. సముద్రంలో పెనుగాలులు వీచినప్పుడు అలలు వువ్వెత్తున లేచి ఓడలు ముక్కలయి పోతాయి. గాలి భీభత్సం అంత భయంకరమైనది.

మానవ శరీరం కన్నా మనసు మీద పెనుగాలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎడారుల నుంచి శాంతా అనే భయంకరమైన పెనుగాలి కాలిఫోర్నియా లోకి వీచినప్పుడు అక్కడ ఆత్మహత్యలు, ట్రాఫిక్ ప్రమాదాలు, గుండెపోటులు ఎక్కువ అవుతాయని చాలామందికి గట్టి నమ్మకం వుంది. అలాస్కాలో బలమైన గాలి వీచినప్పుడు అక్కడి ప్రజలకు నరాలు గడగడలాడతాయని అంటారు.

రాకీ పర్వతాల మీద (అమెరికా) గాలి గంటకి 160 కి.మీ. వేగంతో వీస్తుంది. ఆ గాలి పొడిగా, వెచ్చగా వుండి గంటకి 2.5 సెం.మీ. మందం వున్న మంచును కరిగిస్తుంది. ఒకసారి అది ఆ ప్రాంతంలో ఒక పట్టణంలో ఉష్ణోగ్రతను కేవలం రెండు నిముషాల కాలంలో మైనస్ 20°C నుంచి ప్లస్ 7° C కి పెంచింది. అంటే అంత పెద్దమొత్తంలో మంచును కరిగించిందన్నమాట.

నేడు శాస్త్రవేత్తలు గాలిని కూడా మానవ సంక్షేమానికి వినియోగిస్తున్నారు. గాలి నుంచి యంత్ర సహాయంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తం మీద మన జీవితాల మీద గాలి ప్రభావం అంతా ఇంతా అని చెప్పనలవి కాదు.

— ఆర్.ఎల్.